ప్రయాణం.. నరకప్రాయం

కంకరతేలి ప్రమాదకరంగా మారిన గ్రామీణ రోడ్లు ● అవస్థలు పడుతున్న వాహనదారులు ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కొందుర్గు-ఉమ్మెంత్యాల రోడ్డు దుస్థితి



కొందుర్గు-చౌదరిగూడ రోడ్డు పరిస్థితి

కొందుర్గు: ఓ వైపు కంకర తేలిన రోడ్లు.. మరోవైపు గుంతలు.. మండలంలో ఏ దారిలో వెళ్లినా పరిస్థితి ఇంతే. గ్రామాల రోడ్లన్నీ గుంతలు పడి ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి మరింత అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు మారుతున్నా గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై మాత్రం దృష్టి పెట్టడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రోడ్లపై వాహనాలు బోల్తాపడి ప్రయాణికులు ప్రమాదాలకు గురైన సంఘటనలు చాలా ఉన్నాయని చెబుతున్నారు. ఇవే రోడ్లపై నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు వెళ్తున్నా వాటి మరమ్మతులను మాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

అడుగుకో గుంత..

కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయమై కంకర తేలి ప్రమాదభరితంగా మారాయి. ఈ దారుల గుండా వెళ్లాలంటేనే వాహనదారులు నరకయాతన పడుతున్నారు. కొందుర్గు నుంచి ఉమ్మెంత్యాలకు వెళ్లే బీటీరోడ్డు అడుకో గుంత పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీనికి తోడు రోడ్డుపై కంకర తేలి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా కొందుర్గు మండల కేంద్రం నుంచి వయా తూంపల్లి మీదుగా జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రానికి వెళ్లే దారికి మరమ్మతుల కోసం రోడ్డు తవ్వి ఏడాది అయినా నేటికీ పనులు చేయడం లేదు. రోడ్డు మధ్యలో తవ్వకుండా వదిలేసిన ఒక మీటరు వెడల్పు గల రోడ్డుపైనే వాహనదారులు వెళ్తున్నారు. అయితే వాహనం ఎదురుగా వస్తే రోడ్డు దిగడానికి రావడం లేదని, రోడ్డు దిగితే కింద పడిపోవాల్సిందేనని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికే పలువురు కిందపడి ప్రమాదాలకు గురయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయించాలని కోరుతున్నారు. రోడ్ల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపామని అధికారులను అంటున్నారు. కానీ మరమ్మతులకు నోచుకోవడం లేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

భయంగా ఉంది



రోడ్డుపై గుంతలు పడడంతో ప్రయాణం చేయాలంటేనే భయంగా ఉంటుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. మరమ్మతులు చేయించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా బాగుచేయించడం లేదు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిస్తే మరీ ఇబ్బందే.

–శేఖర్, ఉమ్మెంత్యాల

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



గ్రామీణ రోడ్లన్నీ గుంతలమయంగా మారి అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై వెళ్లాలంటేనే భయంగా ఉంది. బయటకు వెళ్లినవారు తిరిగి క్షేమంగా వస్తారా లేదా అనే పరిస్థితి నెలకొంది. రోడ్లకు మరమ్మతులు చేయించాలి. లేదంటే సీపీఐ తరఫున ఆందోళనకు దిగుతాం.

–బుద్దుల జంగయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

ప్రతిపాదనలు పంపాం..

కొందుర్గు నుంచి ఉమ్మెంత్యాల బీటీరోడ్డు రెన్యూవల్ కోసం ప్రతిపాదనలు పంపాం. కొందుర్గు నుంచి వయా తూంపల్లి చౌదరిగూడ రోడ్డు కాంట్రాక్టరు జాప్యంతో కాస్తా ఆలస్యం జరుగుతుంది. త్వరలోనే పనులు పూర్తిచేయిస్తాం.

–శ్రీనివాసులు, డిప్యూటీ ఈఈ పీఆర్, షాద్‌నగర్

క్లుప్తంగా

పేద కుటుంబాలను ఆదుకుంటాం



షాబాద్: పేద కుటుంబాలను ఆదుకునేందుకు తమవంతు కృషి చేస్తామని షాబాద్ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ చాంద్‌పాషా పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో అదే గ్రామానికి చెందిన దాసరి జంగమ్మ కూతురు పెళ్లికి చాంద్‌పాషా తనవంతు సాయంగా రూ.11వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు తనవంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు గ్రామంలో మొత్తం 42 మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు రూ.11వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సూద యాదయ్య, గ్రామ మాజీ సర్పంచ్‌లు పెద్దజంగని దర్శన్, ర్యాకల శేఖర్, గ్రామస్తులు రాజుగౌడ్, గోపాల్, ఆంజనేయులు, సాయిలు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

నేడు గోకులాష్టమి వేడుకలు

షాద్‌నగర్‌రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని పట్టణంలోని నాగులపల్లి రోడ్డులో గల సాయిరాజా ఫంక్షన్‌హాల్‌లో బాలగోకుల సమితి ఆధ్వర్యంలో నేడు(సోమవారం) గోకులాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నామని ఆదివారం సమితి చైర్మన్ శ్రీవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలు మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమవుతాయని, చిన్నారులకు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఇస్తామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ప్రతి చిన్నారికి ప్రశంసపత్రం, ప్రోత్సాహక బహుమతులను అందిస్తామన్నారు. చిన్నారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసేవిధంగా తల్లితండ్రులు చొరవ తీసుకోవాలని కోరారు.

కురిసిన మోస్తరు వర్షం



అమ్డాపూర్‌లో కురుస్తున్న వర్షం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కొద్దిపాటి వర్షం కురిసి వాతావరణం చల్లబడింది. ఇప్పటికే వర్షాకాలం మూడునెలలు దాటిపోతున్నా వాగులు, వంకలు, కుంటల్లో వర్షం నీరు చేరలేదని రైతులు పేర్కొంటున్నారు. వానదేవుడు కరుణించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

గిరిజనులపై దాడులు ఆపాలి



పొలాల వద్ద నిరసన తెలుపుతున్న తండావాసులు

శంకర్‌పల్లి: అసైన్డ్ భూములు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కొండకల్‌తండాలో తమ పొలాల వద్ద తండావాసులు నిరసన వ్యక్తంచేశారు. నిరసనకు మద్దతుగా నిలిచిన పలు పార్టీల నాయకులు మాట్లాడారు. వల్లభకుంట, మీర్సాబ్‌కుంట, బిల్లా దాఖలు, గిరిజనుల అసైన్డ్ భూములను ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కబ్జాచేస్తుందని ఆరోపించారు. ఇదే విషయంపై ప్రశ్నించిన గిరిజనులపై అక్రమంగా కేసులు పెట్టి, దాడులు చేయిస్తుందని విమర్శించారు ఇప్పటి వరకు శంకర్‌పల్లి, మోకిల ఠాణాల్లో 2021 నుంచి 2024 వరకు పలు సెక్షన్ల కింద 7 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. కబ్జాకు గురైన కుంటలు, గిరిజన అసైన్డ్ భూములను ప్రభుత్వం గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవినాయక్, రాథోడ్ శంకర్‌నాయక్, రాథోడ్‌బాబు, లక్ష్మణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

జయంత్యుత్సవాలను విజయవంతం చేయండి

కందుకూరు: ముదిరాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ కొర్వి కృష్ణస్వామి 131వ జయంతిని విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ మండల యూత్ అధ్యక్షుడు సురేందర్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడు మల్లేశ్‌ముదిరాజ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. సికింద్రాబాద్ న్యూబోయగూడ ముదిరాజ్ భవనంలో సోమవారం ఉదయం ఉత్సవాలను నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ హాజరు కానున్నారన్నారు. ముదిరాజ్‌లు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు



ఉట్టి కొడుతున్న చిన్నారులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాలలో గల శ్రీరంగాయ ఆడిటోరియంలో పాఠశాలల చైర్మన్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నికృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు ఎంతగానో అలరించారు. ఉట్లు కొట్టే కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల నిర్వాహకుడు రవిప్రకాశ్ నగదు బహుమతి అందజేశారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

కాకతీయ పాఠశాలలో

పట్టణంలోని కాకతీయ పాఠశాలలో ప్రిన్సిపాల్ స్వాతిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు ఉట్లు కొట్టే కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషాధారణలో ఎంతో ఆకట్టుకున్నారు.

పల్లెల్లో బోనాల ఉత్సవాలు

షాబాద్: మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో ఆదివారం మైసమ్మ, ఎల్లమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

మహంకాళి బోనాలు: మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో ఆదివారం సాయంత్రం మహిళలు పెద్దఎత్తున మహంకాళి బోనాలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి మహంకాళి ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామంలో సందడిగా మారింది. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.



బోనాల ఊరేగింపు



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాబాద్: షాబాద్ ఉన్నత పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని మండల కేంద్రంలోని ఎంఎస్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులు నర్సింహులు, యాదగిరచారి, కుమారస్వామి, రాంరెడ్డి, లింగం, బి. నర్సింహులు, మంజుల, రమేశ్, శ్రీశైలం, కిష్టయ్యను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు సంజీవ, రాఘవేందర్, రమేశ్, శేఖర్, భూపాల్, మహేశ్, శ్వేత, భాగ్యలక్ష్మి, లావణ్య, గోవిందమ్మ, భూదేవి, నాగరాణి, తదితరులు ఉన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు

చేవెళ్ల: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కోటి 80 లక్షల రూపాయల నిధులతో వేస్తున్న సీసీరోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీటీరోడ్డు వేసేందుకు గతంలోనే కోటి రూపాయల నిధులు విడుదలయ్యాయని, కానీ ఇది బీటీరోడ్డుగా కాకుండా సీసీరోడ్డు వేయాలనే స్థానిక నాయకుల డిమాండ్‌తో ఈ నిధులను బీటీ నుంచి సీసీకి మార్చేందుకు కాస్తా సమయం పట్టిందన్నారు. ప్రస్తుతం వచ్చిన కోటి రూపాయలతో పాటు మరో 40 లక్షలకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఈరోడ్డు పనులు జరుగుతుండగా మరో 40లక్షల రూపాయల నిధులను విడుదల చేయించి ఈ రోడ్డును పూర్తిగా వేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గ హెడ్‌క్వార్టర్ కావటంతో చేవెళ్ల గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి ఈ రోడ్డును వేయాలని సూచించారు. స్థానిక నాయకులు పనులను ఎప్పటికప్పుడూ పరిశీలించాలని సూచించారు. త్వరగా పనులు ప్రారంభించి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఎం.మాలతీ, మాజీ సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు వసంతం, రాములు, మాజీ ఉపసర్పంచ్ గంగి యాదయ్య, నాయకులు ఆగిరెడ్డి, కృష్ణారెడ్డి, మద్దెల శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించి మంచినీటిని అందిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాసుమల్లగూడ గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామస్తులు అప్పటి ప్రతిపక్ష నాయకుడు వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న వీర్లపల్లి శంకర్ మినరల్ వాటర్ ప్లాంట్(ఆర్వో ప్లాంట్) ఏర్పాటు చేస్తానని ప్రతిపక్ష నాయకుడిగా గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత తన సొంత నిధులు రూ.2లక్షలతో గ్రామంలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. గ్రామస్తులకు తాగేందుకు మంచినీటిని అందించారు. ఎమ్మెల్యే ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్ అలీఖాన్, బాల్‌రాజ్‌గౌడ్ చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, రాజేశ్వర్‌రెడ్డి, శివరాములు, జంగ నర్సింహ, కుమార్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మాధవరెడ్డి, మహేందర్, నరేందర్, కృష్ణయ్య, ప్రభాకర్, రవి, శివలీల, లలితమ్మ, సబిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నందిగామ: మండల పరిధిలోని మొదళ్లగూడ సమీపంలో ఉన్న పీర్లకుంట కట్టను రాత్రికి రాత్రే ధ్వంసం చేసి యథేచ్ఛగా రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆదివారం మొదళ్లగూడలో గ్రామస్తులు మాట్లాడుతూ.. మామిడిపల్లి, ఈదులపల్లి, మొదళ్లగూడ, వీర్లపల్లి గ్రామాల శివారులో ఉన్న పీర్లకుంట చెరువు కట్టను సమీపంలోని వెంచర్ నిర్వహకులు రాత్రికి రాత్రే ధ్వంసం చేసి రోడ్డు వేశారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. తరతరాలుగా ఉన్న కుంట కట్టను వెంచర్ నిర్వాహకులు స్వార్థంతో కట్టను తొలగించి రోడ్డును వేయడమేమిటని వారు ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా అటు రెవెన్యూ అధికారులు గానీ, ఇటు ఇరిగేషన్ అధికారులు గానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. కుంట కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. అధికారులు స్పందించనట్లయితే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని గ్రామస్తులు హెచ్చరించారు.

కొత్తూరు-కుమ్మరిగూడ రోడ్డును పూర్తిచేయాలి

కొత్తూరు: పట్టణంలోని పాత జాతీయ రహదారి నుంచి కుమ్మరిగూడ మీదుగా అక్కివానిగూడ వరకు నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయా గ్రామాలకు చెందిన వాహనదారులు కోరుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు మొత్తం బురదమయంగా మారిందని, రాకపోకల సమయంలో వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొంటున్నారు. నిత్యం ఈ రోడ్డు గుండా వందల సంఖ్యలో వాహనాలు, ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నా అధికారులు రోడ్డును అభివృద్ధి చేయడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తిచేయాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరించి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ఆనంద్, తిరుమల కాలనీ యువజన కమిటీ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం యువజన కమిటీ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఆదర్శ పురపాలికగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కాలనీవాసులు కాలనీతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కాలనీ అభివృద్ధిలో కాలనీ వాసులందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు రూ.5కోట్ల నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీవాసులు ఐకమత్యంతో ఏకతాటిపైకి రావడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు బబార్‌అలీఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బస్వం, గోపాల్‌రెడ్డి, మాణిక్‌ప్రభు, గంగిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, శ్రీనునాయక్, ప్రవీణ్, లక్కాకుల కిరణ్‌కుమార్, లింగంయాదవ్, విఠల్‌గౌడ్, రవి, సంజునాయక్, ఖాజా, వెంకటేశ్, శరత్, శ్రీకాంత్, సాయి, నర్సింహ, అహ్మద్, నారాయణ, సీతారాం, చందు తదితరులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో చిన్నారుల ప్రతిభ



చిన్నారులను అభినందిస్తున్న కూచిపూడి నాట్య గురువులు

షాద్‌నగర్‌రూరల్: మధుర గానాలతో చేసిన కూచిపూడి నృత్యం చూపరులను ముగ్ధమనోహరంగా కట్టిపడేసింది. శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో శ్రీ వైష్ణవి ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనను నిర్వహించారు. ఈ నృత్య ప్రదర్శనలో పట్టణానికి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి రంజుప్రవీణ నిర్వహిస్తున్న ప్రభోదయ డ్యాన్స్, మ్యూజిక్ నిలయంలో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారి అక్షయ కూచిపూడి నృత్యంలో పలుకే బంగారమాయే గానంపై ఇచ్చిన ప్రదర్శనలో చక్కటి ప్రతిభను కనబరిచింది. అభినయం, హావభావాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అదేవిధంగా చిన్నారులు చేసిన సిద్ధివినాయక, పుష్పాంజలి ప్రదర్శనలు కూచిపూడి కళాకారులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీ వైష్ణవి థియేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్యంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచినందుకు చిన్నారి అక్షయకు ప్రముఖ కూచిపూడి నాట్య గురువు డాక్టర్ సజని వల్లభనేని మెమొంటో, ప్రశంసపత్రాన్ని అందజేసి అభినందించారు. నాట్య కళాకారిణి రంజుప్రవీణకు జ్ఞాపిక, ప్రశంసపత్రాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు.

సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చింతకుంట తండా నుంచి చెన్నారెడ్డిగూడ రోడ్డు పూర్తిగా గుంతలపడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి స్పందించి రూ.10 వేలు ఖర్చుచేసి రోడ్డుపై మొరం వేయించి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా స్థానికులు శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు.